క్లుప్తంగా

నార్కట్‌పల్లి సీఐగా మహేష్



చిట్యాల : నార్కట్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టి.మహేష్ సోమవారం చిట్యాలలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో విధుల్లో చేరారు. చౌటుప్పల్ రూరల్ సీఐగా పనిచేస్తూ ఆయన బదిలీపై నార్కట్‌పల్లి సర్కిల్‌కు వచ్చారు. ఆయనకు చిట్యాల ఎస్‌ఐ రవి స్వాగతం పలికారు. నార్కట్‌పల్లి సీఐగా పనిచేసిన కె.శివరాంరెడ్డి డీఎస్పీగా పదోన్నతి పొందడంతో విధుల్లో నుంచి రిలీవ్ అయ్యారు.

నేడు బీజేపీ సమావేశం

నల్లగొండ టూటౌన్ : బీజేపీ నల్లగొండ పట్టణ కమిటీ సమావేశం మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి చర్లపల్లి గణేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు, నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

టీడీపీని బలోపేతం చేయాలి

నకిరేకల్ : టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాకుల అంజయ్య కోరారు. నకిరేకల్‌లో సోమవారం టీడీపీ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మండల కమిటీని నియమించారు. మండల అధ్యక్షుడిగా అంతటి రాములు, ఉపాధ్యక్షులుగా జెగ్గ బుచ్చాలు, చెట్టిపల్లి నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా నకిరేకంటి సతీష్, కార్యదర్శిగా నిమ్మల సైదులు ఎన్నికయ్యారు. నక్క రాంబాబేష్, దొమ్మాటి సైదులు, గద్దపాటి వెంకటేశ్వర్లు పట్టణ అధ్యక్షుడు పసుపులేటి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్థల పరిశీలన

నకిరేకల్ : పట్టణంలోని మినీ స్టేడియం సమీపంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సహకారంతో రూ. కోటి వ్యయంతో నూతనంగా నిర్మించనున్న షాదీఖానా నిర్మాణం కోసం స్థలాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

పెంచిన వేతనాలు అమలు చేయాలి

కేతేపల్లి : మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ కార్మికులకు ప్రభుత్వం పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఆదిమళ్ల సుధీర్ డిమాండ్ చేశారు. సోమవారం కేతేపల్లిలో నిర్వహించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మట్లాడారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కోనేటి ముత్తమ్మ, బొజ్జ ఎల్లమ్మ, సునీత, స్వరాజ్యం, కవిత పాల్గొన్నారు.

నీలగిరి కవుల సంచికపై గ్రూప్‌-4లో ప్రశ్న

రామగిరి(నల్లగొండ) : జిల్లా కేంద్రానికి చెందిన కవి, రచయిత పున్న అంజయ్య రచించిన నీలగిరి కవుల సంచికపై గ్రూప్‌-4 పరీక్ష పత్రంలో ప్రశ్న అడిగారు. జనరల్ స్టడీస్ పేపర్‌లో నీలగిరి కవుల సంచిక రాసిందెవరు అనే ప్రశ్న అడిగారు. నల్లగొండకు చెందిన పున్న అంజయ్య 1991లో నీలగిరి కవుల సంచికను రచించారు. గ్రూప్‌-4 పరీక్షలో అంజయ్య రచనపై ప్రశ్న రావడంతో జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు మేరెడ్డి యాదగిరిరెడ్డి, బి.రాములు, కొలనుపాక మురళీధర్‌రావు, చకోనా, డాక్టర్ తిరునగరి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న దీక్షలు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 74వ రోజు కొనసాగాయి. దీక్షలో అఖిలపక్ష పార్టీల నాయకులు కూర్చున్నారు. ఫార్మా వ్యతిరేక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

శాలిగౌరారం : రోడ్డుపై నరికివేసిన తాటిచెట్టు తగిలి ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన సంఘటన శాలిగౌరారం శివారులో సోమవారం రాత్రి జరిగింది. వివరాలలు.. శాలిగౌరారం-నకిరేకల్ ప్రధాన రోడ్డుపై శాలిగౌరారం శివారులో రోడ్డువెంట తాటిచెట్టును గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. తాటిచెట్టు రోడ్డుపై బీటీరోడ్డు మధ్యవరకు పడి ఉంది. రాత్రి అడ్లూరు గ్రామానికి చెందిన కట్టంగూరి నరేశ్(26) తన ద్విచక్ర వాహనంపై అడ్లూరు నుంచి మండలకేంద్రానికి వస్తున్న క్రమంలో తాటిచెట్టు తగలడంతో కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో నరేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో రోడ్డుపై వెళ్తున్నవారు చూసి బాధితుడి కుటుంబీకులు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని నరేశ్‌ను 108లో నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం నరేశ్‌ను నల్లగొండకు తరలించారు.

నోట్‌బుక్స్ అందజేత

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 140 మంది విద్యార్థులకు సోమవారం కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ సహకారంతో ఫౌండేషన్ సభ్యులు నవీన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అశోక్ గౌడ్, ఎంపీటీసీ గొరిగె సత్తయ్యలు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు ఉదావత్ లచ్చిరామ్, గోన వెంకటేశ్వరరావు, నరసింహ, రాణి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తీరనున్న వాహనదారుల కష్టాలు

- శాలిగౌరారం-గురుజాల డబుల్ రోడ్డు పనులు త్వరలో ప్రారంభం
- 2.1 కిలోమీటర్లకు రూ.5 కోట్లు మంజూరు

శాలిగౌరారం : సింగిల్ రోడ్డుగా ఉన్న శాలిగౌరారం-గురుజాల ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇక డబుల్ రోడ్డుగా అభివృద్ధి చెందనుంది. రూ.5 కోట్ల వ్యయంతో శాలిగౌరారం నుంచి 2.1 కిలోమీటర్లు గురుజాల రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయనున్నారు. శాలిగౌరారం నుంచి గురుజాల వరకు 4.7 కిలోమీటర్లు. కాగా దాంట్లో 2.1 కిలో మీటర్లు ప్రస్తుతం అభివృద్ధి చెందనుంది. మిగిలిన 2.6 కిలోమీటర్లు పూర్తి కావాల్సి ఉంది.

ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

మండలానికి ప్రధాన రోడ్డుగా ఉన్న శాలిగౌరారం-గురుజాల సింగిల్‌రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో రోడ్డుపై ఎదురెదురుగా వచ్చే వాహనదారులు గుంతలను తప్పించే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని 10 గ్రామాలకు చెందిన ప్రజలు మండలకేంద్రంతో పాటూ నకిరేకల్, నల్లగొండ, సూర్యాపేట పట్టణాలకు వెళ్లాలంటే ఈ రోడ్డు గుండానే వెళ్లాల్సి ఉంటుంది. కాగా మూసీనదిపై గురుజాల-మానాయికుంట గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో పాటూ బ్రిడ్జికి ఇరువైపులా అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తి కావొస్తుండడంతో రోడ్డుపై వాహనాల రాకపోకలు మరింతగా పెరిగాయి.



డబుల్ రోడ్డుగా మారనున్న శాలిగౌరారం-గురుజాల ప్రధాన రోడ్డు

రూ. 5 కోట్ల వ్యయంతో ..

శాలిగౌరారం నుంచి గురుజాల వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ సింగిల్ రోడ్డును 2.1 కిలోమీటర్ల పొడవు వరకు డబుల్ రోడ్డుగా అభివృద్ధి పరిచేందుకు సీఆర్‌ఐఎఫ్ (సెంట్రల్ రోడ్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్) నిధుల నుంచి ప్రభుత్వం రూ. 5 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇందులో 1.60 కిలోమీటర్లు బీటీ డబుల్ రోడ్డుతో పాటూ శాలిగౌరారం బస్టాప్ సమీపంలో బాక్స్‌బ్రిడ్జి, రామగిరిలో 400 మీటర్లు పొడవు సీసీ డబుల్ రోడ్డు వేయనున్నారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఆరునెలల క్రితమే ఆన్‌లైన్ పద్ధతిలో టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. నకిరేకల్ మండలం కడపర్తి నుంచి శాలిగౌరారం వరకు రూ.18 కోట్ల వ్యయంతో ఇప్పటికే 12.9 కిలో మీటర్లు డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు.

రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి



శాలిగౌరారం-గురుజాల రోడ్డు అభివృద్ధి చెందితే మండలం నుంచి ఇతర ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. ఇప్పటికే మూసీ నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తికాగా అప్రోచ్ రోడ్ల నిర్మాణం సాగుతోంది. మండల కేంద్రం నుంచి గురుజాల వరకు డబుల్ రోడ్డు పూర్తయితే యాదాద్రిభువనగిరి, సూర్యాపేట వరంగల్ జిల్లాతో రవాణా సౌకర్యాలు పెరగనున్నాయి.

– గుండా శ్రీనివాసులు, సర్పంచ్, గురుజాల

అగ్రిమెంట్ కూడా పూర్తయ్యింది



శాలిగౌరారం-గురుజాల ఆర్‌అండ్‌బీ రోడ్డును డబుల్ రోడ్డుగా అభివృద్ధి పరిచేందుకు రూ.5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణానికి 18 నెలల గడువుతో కూడిన అగ్రిమెంట్ ప్రక్రియ కూడా ఇటీవలే పూర్తయ్యింది. దీంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. నిర్ణీత గడువులోనే రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

– సంతోష్‌కుమార్, ఆర్‌అండ్‌బీ ఏఈ

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

చిట్యాల : పార్టీలో పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల పట్టణంలోని పదో వార్డుకు చెందిన ఏరుకొండ మహేష్ గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బీఆర్‌ఎస్ సభ్యుడైన మహేష్‌కు పార్టీ ప్రమాద బీమా ద్వారా మంజూరైన రెండు లక్షల రూపాయల చెక్కును సోమవారం ఎమ్మెల్యే మృతుడి ఇంటికి వెళ్లి తండ్రి లక్ష్మయ్యకు అందజేసి మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, కౌన్సిలర్లు సిలివేరు మౌనిక శేఖర్, బెల్లి సత్తయ్య, నాయకులు వనమా వెంకటేశ్వర్లు, గుండెబోయిన సైదులు, మందడి జనార్దన్‌రెడ్డి, దాసరి నర్సింహ, పొన్నం లక్ష్మయ్యగౌడ్, జిట్ట చంద్రకాంత్, జగిని భిక్షంరెడ్డి పాల్గొన్నారు.



చిట్యాలలో బీమా చెక్కు అందజేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

చిట్యాల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన వారిజాల వేణుగోపాలస్వామి పిరమిడ్ ధ్యాన మందిరాన్ని సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, పీఎస్‌ఎస్‌ఎం జిల్లా అధ్యక్షుడు భూసాని జగదీశ్వర్‌రెడ్డి, సురేష్, నిర్వాహకులు యాస కిరణ్‌కుమార్‌రెడ్డి, పున్న పాండు పాల్గొన్నారు.

కళాకారుడికి చేయూత

కనగల్ : మండల పరిధిలోని రేగట్టే గ్రామానికి చెందిన బోగరాజు జాని హైదరాబాద్‌లో నిర్వహించే బోనాల పండుగలో పోతురాజుల వేషధారణ వేయనున్నాడు. కావాల్సిన సామగ్రిని అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బోగరాజు వెంకటేశం సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో యర్రోల్ల సురేష్, జక్కల శ్రీను, మార్గం యాదయ్య, నరాల చంద్రయ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చండూరు : ఈ నెల 8, 9 ,10 తేదీల్లో హైదరాబాదులో జరిగే ఏఐవైఎఫ్ జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొన్‌రెడ్డి సాయి, గడ్డం నవీన్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం వారు చండూరులో ఆవిష్కరించి మాట్లాడారు. పల్లె చరణ్, సుంకరి తరుణ్, పల్లె సునీల్, ప్రవీణ్, లెనిన్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేలో వినతుల వెల్లువ



వినతిపత్రం అందిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

నల్లగొండ : వడ్డెర కులస్తులను బీసీ జాబితాలో నుంచి తొలగించి ఎస్టీలో చేర్చాలని కోరుతూ తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. బీసీ కులవృత్తి రుణాలను అర్హులైన వడ్డెరలకు ఇవ్వాలని, ఉప్పల్ బాగాయత్‌లో వడ్డెర్ల ఆత్మగౌరవ భవనాన్ని రూ.5 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించాలని కోరారు. ముందుగా సంఘం నాయకులు ర్యాలీ నిరాహార దీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుంచం మల్లేష్, గండికోట సతీష్, కుంచం వెంకన్న, గండికోట శేఖర్ గండికోట మహేష్, పల్లపు లింగయ్య, నర్ర మహేష్, ఇరగదిండ్ల శంకర్, గండికోట సాయి కుమార్, గండికోట కోటేష్, గండికోట విక్రం తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని ముశంపల్లి చిన్న చెరువు కట్ట నిర్మాణం చేపట్టాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం గ్రీవెన్స్‌డేలో అదనపు కలెక్టర్‌కు భాస్కర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. అక్టోబర్ 2020 అకాల వర్షాలకు కట్ట తెగిపోవడంతో చెరువు కింద ఉన్న రైతులు వరిసాగు, పండ్ల తోటలు, కూరగాయల సాగు చేయలేకపోతున్నారని వివరించారు. ఈ చెరువు కట్ట పైనుంచి ముశంపల్లి-ధర్మాపురం, ఇరుగంటిపల్లి, ఎర్రబెల్లి, కన్నెకల్ గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో బీజేపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పాషా, షరీఫ్, మహేష్ తదితరులు ఉన్నారు.

గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలని..

నల్లగొండ టౌన్ : డీడీలు కట్టిన వారందరికీ వెంటనే గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో గొర్రెల మేకల పెంపకందారుల సంఘం ప్రతినిధులు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జూన్ 9న పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి దానికి కొనసాగించకుండా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య, సాగర్ల మల్లేష్, మెట్టు నర్సింహ, చిరబోయిన గట్టయ్య, వెంకన్న ఉన్నారు.

పీఆర్టీయూతోనే సమస్యలు పరిష్కారం

కనగల్ : పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి, బసిరెడ్డి రవీందర్‌రెడ్డి, మేకల జాన్‌రెడ్డి, గాదె వెంకట్‌రెడ్డి, తీగల శంకరయ్య, సిరిగిరి రామకృష్ణారెడ్డి, రమేష్, బాల్‌రెడ్డి, మురళీ, వెంకటేశ్వర్లు, సుధాకర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, తరి రాములు, తిరందాసు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో..

నల్లగొండ : పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత నమోదు కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని రామగిరి గర్ల్స్ హైస్కూల్, బోయవాడ, నల్లగొండ అర్బన్ రెసిడెన్షియల్ హైస్కూల్‌లో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ ప్రారంభించారు. పీఆర్టీయూ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం నారాయణ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాసులు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శులు బసిరెడ్డి రవీందర్ రెడ్డి, మేకల జాన్‌రెడ్డి, నల్ల గొండ అర్బన్ మండల అధ్యక్షుడు గాదె వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తీగల శంకరయ్య, కొసణం కరుణాకర్ రెడ్డి, బోయసపల్లి రమేష్ కుమార్, చిలుముల బాల్ రెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్

చిట్యాల మండలంలో..

చిట్యాల : చిట్యాల, గుండ్రాంపల్లి, సుంకెనెపల్లి, ఏపూరు, పేరేపల్లి, పిట్టంపల్లి, బొంగోనిచెర్వు, చిన్నకాపర్తి ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మండల ప్రధానకార్యదర్శి గోలి స్లీవమ్మ, సీహెచ్.నర్సింగరావు, నరేందర్‌రెడ్డి, దయాకర్, కృష్ణ, కిరణ్, శ్యాంసుందర్‌రెడ్డి, ధర్మేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

శాలిగౌరారం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు సోమవారం ఎంపీడీఓ లక్ష్మయ్యకు సమ్మె నోటీస్ అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 6 నుంచి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు గూని గంగరాములు, గౌరవాధ్యక్షుడు బండి వీరయ్య, మండల అధ్యక్షుడు చెర్లపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు నగేశ్, కార్యదర్శి వెంకన్న, కోశాధికారి మల్లేష్, ప్రతినిధులు సాయిలు, మన్సూర్, సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓకు సన్మానం



కొండల్‌రావును సన్మానిస్తున్న టీఎన్‌జీఓ నాయకులు

నల్లగొండ టౌన్ : డాక్టర్స్‌డేను పురస్కరించుకుని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావును ఆయన చాంబర్‌లో టీఎన్‌జీఓ నాయకులు ఘనంగా సన్మానించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు మంత్రవాది శ్రవన్‌కుమార్, కార్యదర్శి కంచనపల్లి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు జె.శేఖర్‌రెడ్డి, బీమనపల్లి దుర్గయ్య, డి.లక్ష్మి, అనురాధ, మహ్మద్‌నజీరుద్దీన్, కొంపెల్లి మత్స్యగిరి, పద్మ, ఏనుగు భిక్షమయ్య, కె.శైలజ, వెంకట్‌రెడ్డి, నందు, వీరభద్రమ్మ, ప్రేమలత, భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

కనగల్ : మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన రవీందర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పంపిన రూ.10 వేల నగదును ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం సోమవారం అందజేశారు.

కట్టంగూర్ : మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మేడి ఇద్దయ్య భార్య రత్నమ్మ(70) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. రత్నమ్మ మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, కొండేటి మల్లయ్య, దైద రవీందర్, మేడి ప్రియదర్శిని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వీరేశం, కాంగ్రెస్ నాయకుడు కొండేటి మల్లయ్య రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని 6వ వార్డు ఏఆర్‌నగర్ శ్మశానవాటికలో రూ. 20 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం ఆ వార్డు కౌన్సిలర్ కర్నాటి కరుణాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ రాములు, డీఈ వెంకన్న, కాలనీవాసులు సతీష్, అలీమియా, కత్తుల వెంకన్న పాల్గొన్నారు.

మొక్కలు నాటిన డీఈఓ

నల్లగొండ : హరితహారంలో భాగంగా సోమవారం డీఈఓ బొల్లారం భిక్షపతి తన కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏడీ. జె.రామాచారి, సూపరింటెండెంట్లు సీహెచ్. మోహన్‌శంకర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు



నల్లగొండ : పూజలో పాల్గొన్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ : పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కంచర్ల, తదితరులు

రామగిరి(నల్లగొండ) : గురు పౌర్ణమి వేడుకలను సోమవారం నల్లగొండ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శివాజీనగర్, రాఘవేంద్ర కాలనీ, చర్లపల్లి, ముషంపల్లి రోడ్డు సాయినగర్ కాలనీ, వీటీ కాలనీల్లోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలు, ఫలాలతో సాయిబాబా విగ్రహాలను అలంకరించారు. పాలతో అభిషేకాలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి సాయిబాబా విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.

శాసన మండలి చైర్మన్ ప్రత్యేక పూజలు

గురు పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని శివాజీనగర్ సాయిబాబా ఆలయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ పాశం రాంరెడ్డి దంపతులు, యామ దయాకర్, నేలపట్ల సత్యనారాయణ, మందడి మధుసూదన్‌రెడ్డి, బోయినపల్లి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పట్టణంలోని శివాజీనగర్, ముషంపల్లి రోడ్డు, వీటి కాలనీ, చర్లపల్లిలోని సాయిబాబా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చర్లపల్లి హైవే పక్కన నూతనంగా నిర్మిస్తున్న సాయిబాబా ఆలయానికి రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఆయనవెంట మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, యామ దయాకర్ తదితరులు ఉన్నారు.

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ ఐశ్వర్యసాయి మందిరంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున కాగడ హారతి, శ్రీ సాయి నాథుడికి భక్తులు 108 కళశాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. గోపూజ, సామూహిక సచ్చరిత్ర పారాయణం, సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా జరిగాయి.



నల్లగొండ : పూజలో పాల్గొన్న భక్తులు

హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ నేత దైద రవీందర్‌లు వేర్వేరుగా హాజరై పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కాసం లింగయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్,, ఆలయ ప్రధాన కార్యదర్శి బొల్లం సత్తయ్యయాదవ్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిట్యాల : పట్టణంలోని సాయిద్వారకాపురి కాలనీలో గల సాయి ఆలయంలో, వట్టిమర్తి గ్రామ శివారులోని సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో సాయిబాబా విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాటి మాధవరెడ్డి, బాలగోని రాజుగౌడ్, తోకల నరేందర్‌రెడ్డి, జొర్రీగల శ్రీనివాసులు, కృష్ణమోహన్, వనమా వెంకటేశ్వర్లు, జిట్ట పద్మ, శీలా సత్యనారాయణ, రంగా వెంకన్న పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల, కట్టంగూర్ సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు సాయిబాబా విగ్రహానికి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయిటిపాముల సాయిబాబా ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో శాలిగౌరారం సర్కిల్ సీఐ రాఘవరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ బెజవాడ సరోజన సైదులు, పెద్ది సుక్కయ్య, ఇటికాల సురేందర్, చెవుగోని నాగరాజు, గోలి శివ, శంకర్, యాదయ్య, సత్యనారాయణశర్మ పాల్గొన్నారు.



కట్టంగూర్ : అయిటిపాముల సాయిబాబా గుడిలో పూజలు చేస్తున్న సీఐ రాఘవరావు



నకిరేకల్ : వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి : గురుపౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని రెండు శివాలయాలు, సాయిబాబా ఆలయంలో అర్చకులు భగవాన్‌శర్మ, మురళీధర్ పంతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.



నల్లగొండ : పూజలో పాల్గొన్న భక్తులు



నకిరేకల్ : వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

విద్యుత్ కోతలతో పట్టణ ప్రజల ఇక్కట్లు

నల్లగొండ : విద్యుత్ అధికారుల తీరుతో నల్లగొండ పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే పట్టణంలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు, ఎన్‌జీ కాలేజీ పరిసర ప్రాంతాలైన హౌజింగ్‌బోర్డు, శ్రీనగర్‌కాలనీ, ఎల్పీటీ మార్కెట్, తులసీనగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం అధికారులు ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే చెట్లు కొట్టేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కూడా కరెంటు రాకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఇన్‌చార్జ్ అధికారులు తీసుకున్న నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మధ్య కాలంలో రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే గంటల తరబడి పునరుద్ధరించడం లేదని పట్టణవాసులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కింద స్థాయి అధికారులు కొందరు పట్టీపట్టనట్లు వ్యవహరించడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలో అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

జూనియర్ కాలేజీలో తరగతులు ప్రారంభం

నార్కట్‌పల్లి : ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు నాణ్యతమైన విద్య అందుతుందని నార్కట్‌పల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సోమవారం తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ కాలేజీలో చేరేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పృథ్వి మనోహర్, కరుణాదేవి, మల్లెబోయిన రామలింగయ్య, నడింపల్లి వెంకటేశ్వర్లు, నడింపల్లి వెంకన్న, ఈశ్వరాచారి, ధరణి, సర్వస్వతి, స్వాతి, గోవర్ధన్, శంబయ్య, సురేష్, రవిశంకర్ తదితరులు ఉన్నారు.



తరగతి గదిని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

చండూరు : చండూరు మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం అధికారులు, కాంట్రాక్టర్లతో హైదరాబాద్ పరిధిలోని మున్సిపల్ చీఫ్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గానికి బీటీ రోడ్లకు పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.74 కోట్ల 16 లక్షలు సీఎం మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధ్వంసమైన ఆనకట్ట పరిశీలన

శాలిగౌరారం : జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చేందుకు మూసీ నదిపై రామన్నపేట మండలం పల్లివాడ వద్ద నిర్మించిన ఆనకట్టను నీటిపారుదల శాఖ ఏఈ రాములు సోమవారం పరిశీలించారు. ఆనకట్ట పైభాగంలో పలుచోట్ల ధ్వంసమైన ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఆనకట్ట, హెడ్‌రెగ్యూలేటర్లను పరిశీలించినట్లు ఏఈ తెలిపారు. రాచకాల్వ పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయనవెంట రామగిరికి చెందిన రైతు ప్రతినిధి చామల వెంకటరమణారెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.